RNI: TELTEL12215

https://youtube.com/@UstudioTV

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com



WANTED

ప్రభాత సూర్యుడు

www.prabhathasuryudu.com

రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టే సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాదరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.

కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన... తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించాలెను. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

prabhathasuryuduedítor@gmail.com

https://youtube.com/@UstudioTV

94940 54338



RANGAREDDY, EDITION : 01, VOLUME :165 EDITOR:CHERUKU UPENDAR, DATE : MONDAY 30 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 165 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : సోమవారం 30 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## పోరాటాలతోనే తెలంగాణ



■ నేను చావు నోట్లో తల పెట్టాక ప్రకటన చేశారు ■ అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అమాంతం మింగేస్తారు

■ ఆలేరు ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

**నల్లగొండ- :** తెలంగాణ రాష్ట్రాన్ని తామే ఇచ్చామని చెప్పుకునేందుకు కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. రాజీ లేని పోరాటాలతో, గొప్ప ఉద్యమం చేస్తే తెలంగాణ వచ్చిందని, నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎంతోమంది ప్రాణాలను బలి తీసుకుందన్నారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అని తాను చావు నోట్లో తల పెట్టాక కేంద్రం ప్రకటన చేసిందని, ఆ తర్వాత రాజీనామాల డ్రామాకు తెర లేపి, ఏడాది పాటు వాయిదా వేశారన్నారు. శ్రీకాంతాచారి లాంట ఎంతో మంది ఉద్యమకారుల ఆత్మబలిదానాల వల్ల తెలంగాణ వచ్చిందని, తెలంగాణ రాష్ట్రాన్ని తామే ఇచ్చామని చెప్పుకునేందుకు కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలని అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి, కోదాడ, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఉద్యమకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో మంది ఉద్యమకారులను జైల్లో పెట్టిందని కేసీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ, ఢిల్లీలో పొత్తులు పెట్టుకొని 14-15 ఏళ్లు ఏడిపించిందన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేయాలని ఓ మంత్రిని కోరితే అమెరికాకు పారిపోయాడని, ఆనాడు కాంగ్రెస్, బీజేపీ నుంచి ఒక్కడు కూడా ముందుకు రాకుండా ఉద్యమానికి ద్రోహం చేశారని ఆరోపించారు. అప్పట్లో బూట్లు మోసి, చెంచాగిరీ చేసిన వారు ఇప్పుడు ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేళ్లుగా అధికారం లేక కాంగ్రెస్ నేతలు ఆకలితో ఉన్నారని, ఒక్కసారి అవకాశం ఇస్తే మేకల మందపై తోడేళు

మిగతా 2లో

### 100 పరుగుల తేడాతో

## టీమ్ ఇండియా గెలుపు



లఖ్‌నవూ - ప్రభాత సూర్యుడు

సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా ఎదురు లేకుండా సాగిపో తోంది. ఇప్పటివరకు ఓటమి అనేదే లేకుండా సెమీస్‌లోకి అడుగుపెట్టింది. లఖ్‌నవూ వేదికగా జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లాండ్‌ను టీమ్‌ఇండియా 100 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి నాకౌట్ బెర్తును ఖరారు చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియా బౌలర్ల ధాటికి

మిగతా 2లో

### ఈజిప్టు అధ్యక్షుడితో

## ప్రధాని మోడీ చర్చలు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఇజ్రాయిల్- పాలస్తీనా యుద్ధంపై ప్రధాని మోడీ, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్ - సిసితో చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు, మానవతా సంక్షోభంపై ఇరువురు నేతలు శనివారం ఫోన్ లో మాట్లాడారు. పెరుగుతున్న ఉగ్రవాదం, హింస, పౌరుల ప్రాణనష్టంపై ఇరువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతను వాతావరణాన్ని త్వరగా పునరుద్ధ రించాలని, బాధితులకు మానవ సహాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని ఇరువురు నేతలు పిలుపు నిచ్చారు. ఈ చర్చలపై ఆదివారం ఉదయం విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇరువురు నేతలు కొనసాగుతున్న యుద్ధంతో ఆ ప్రాంతం, మరియు ప్రపంచానికి ఎదురయ్యే చిక్కుల గురించి చర్చించినట్లు తెలిపింది. గాజాలోఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు ఈజిప్టు అధ్యక్ష కార్యాలయ అధికార ప్రతినిధి తెలిపారు. పరిస్థితులు మరింత దిగజారితే వచ్చే ముప్పుపైనా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. సామాన్య పౌరుల జీవితాలు, ప్రాంతీయ భద్రతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండనుందో చర్చించినట్లు తెలిపారు.

## జర్నలిస్టుల ఇంటి స్థలాలకు మద్దతు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చే విషయంలో తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రకటించారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశాన్ని పొందుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) అధ్యక్షులు బొలోజు రవి, ట్రెజరర్ చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్ దండ రామకృష్ణ, సలహాదారు కె.విక్రమ్ రెడ్డి తదితరులు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇది న్యాయబద్ధమైన విన్నపమేనని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే తప్పకుండా ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు డీజేహెచ్‌ఎస్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

మిగతా 2లో

### ఘోర రైలు ప్రమాదం..

## ఆరుగురు మృతి

విజయనగరం- విజయనేత్ర



విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు రైళ్లు డీ కొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో విజయనగరం ఆసుపత్రికి తరలిస్తున్నారు. రైల్వే అధికారుల, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 7.10 గంటల సమయంలో విశాఖ నుంచి పలాస వెళ్తున్న ప్రత్యేక ప్యాసింజర్ రైలు కొత్తవలస మండలం అలమండ-కంటకాపల్లి వద్ద సిగల్ కోసం పట్టాలపై ఆగి ఉంది. అదే సమయంలో దాని వెనకాలే వస్తున్న విశాఖ-రాయగడ రైలు.. ప్యాసింజర్ రైలును డీ కొట్టింది. ప్రమాదంపై రైల్వే బోర్డు గ్రూపులో డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ సమాచారం ఇచ్చారు. ఎన్డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో 3 బోగీలు పట్టాలు తప్పాయి. రైళ్లు డీకొనడంతో ఘటనా స్థలంలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో ఆ ప్రాంతమంతా అంధకారం నెలకొనడంతో సహాయక చర్యలకుఆటంకమేర్పడింది. మఅతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తు న్నారు. ఘటనా స్థలిలో భీతావహ పరిస్థితి నెలకొంది. విజయనగరం జిల్లా లో జరిగిన రైలు ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో

మిగతా 2లో

### గాజాలోని అతిపెద్ద ఆస్పత్రిపై

## ఇజ్రాయిల్ వైమానిక దాడి



గాజా - విజయనేత్ర

గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ అటు వైమానిక దాడులు, ఇటు భూతల దాడులతో విరుచుకుపడుతోంది. ఆదివారం గాజాలోని అతిపెద్ద ఆస్పత్రిపై ఇజ్రాయిల్ దాడికి దిగింది. రోగులతో పాటు వేలాది పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న ఈ ఆస్పత్రిపై వైమానిక దాడి చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆస్పత్రి కింద హమాస్ కమాండ్ పోస్ట్ ఉందంటూ ఇజ్రాయిల్ ఆరోపిస్తోంది. హమాస్‌పై ఇజ్రాయిల్ యుద్ధం " రెండో దశ " కు చేరుకుంటుందని ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించిన మరుసటి రోజు ఈ దాడులు చేపట్టడం గమనార్హం. వైమానిక, భూతల,

మిగతా 2లో

### 100 పరుగుల తేడాతో

# టీమ్ ఇండియా గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

ఇంగ్లాండ్ 34.5 ఓవర్లలో 129 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టు బ్యాటర్లలో ఏ ఒక్కరూ భారీ స్కోర్ చేయలేకపోయారు. లివింగ్‌స్టోన్ (27) టాప్ స్కోరర్. జానీ బెయిర్‌స్టో (14), డేవిడ్ మలన్ (16) పరుగులు చేయగా.. జో రూట్ (0), బెన్‌స్టోక్స్ (0) పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. బట్లర్ (10), మొయిన్ అలీ (15), క్రిస్‌వోక్స్ (10) వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. షమి (4/22), బుమ్రా (3/32), కుల్‌దీప్ యాదవ్ (2/24) ఇంగ్లాండ్ పతనాన్ని శాసించారు. జడేజా ఒక వికెట్ పడగొట్టాడు.

భారత ఆటగాళ్లలో టాప్ ఆర్డర్‌లోని శుభ్‌మన్ గిల్ (9), విరాట్ కోహ్లీ (0), శ్రేయస్ అయ్యర్ (4) తీవ్రంగా నిరాశపర్చగా.. రోహిత్ శర్మ (87బీ 101 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి సెంచరీ ముంగిట ఔటయ్యాడు. కేఎల్ రాహుల్ (39బీ 58 బంతుల్లో 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా.. రవీంద్ర జడేజా (8) విఫలమయ్యాడు. సూర్యకుమార్ యాదవ్ (49బీ 47 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో అర్ధ శతకం చేజార్చుకున్నాడు. 40 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన భారత్‌ను రోహిత్, కేఎల్ రాహుల్ ఆదుకున్నారు. ముఖ్యంగా రోహిత్ బౌండరీలు బాది స్కోరు బోర్డును ముందుకు కదిలించాడు. అతడికి రాహుల్ చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 91 పరుగుల కీలక భాగ స్వామ్యాన్ని నెలకొల్పారు. రోహిత్ ఔటైన తర్వాత సూర్యకుమార్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించి జట్టు స్కోరు 200 దాటడంలో కీలకపాత్ర పోషించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో డేవిడ్ విల్లీ 3, క్రిస్ వోక్స్ 2, ఆదిల్ రషీద్ 2, మార్క్ వుడ్ ఒక వికెట్ పడగొట్టారు.

# జర్నలిస్టుల ఇంటి స్థలాలకు మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

.అధ్యక్షులు బొల్లోజు రవి మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు వారు ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ. 10 లక్షల ఆర్థిక సాయం చేయాలని, ఆ మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరినట్లు తెలిపారు. కాగా, ఇప్పటికే తాము బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులకూ వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీ కవిత, టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు తదితరులను కలిసినట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని పొందుపరచాలని వారిని కోరామన్నారు. ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీలను కలిసి మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇళ్ల అంశం చేర్చాలని డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ పలు పార్టీలను కోరుతున్న సంగతి తెలిసిందే.

# ఘోర రైలు ప్రమాదం.. ఆరుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు హెల్ప్ లైన్ నంబర్లు ఏర్పాటు చేశారు. సమాచారం కోసం.. 0891 2746330, 0891 2744619, 81060 53051, 81060 53052, 85000 41670, 85000 41677, 83003 83004, 85005 85006 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

**రైలు ప్రమాద ఘటనపై సీఎం దిగ్భ్రాంతి**

రైలు ప్రమాద దుర్ఘటనపై ముఖ్యమంత్రి జగన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. విశాఖ నుంచి రాయగడ వెళ్తున్న ప్యాసింజర్ రైలుకు ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమిక సమాచారం వచ్చిందని, ఈ ఘటనలో నాలుగు బోగీలు పట్టాలు తప్పినట్టుగా సమాచారం అందుతోందని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విజయనగరం సమీప జిల్లాలైన విశాఖ పట్నం, అనకాపల్లి నుంచి వీలైనన్ని అంబులెన్స్‌లను పంపించాలని, మెరుగైన వైద్యం అందించడానికి సమీప ఆస్పత్రుల్లో అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవిన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షత గాత్రులకు వైద్య సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశాలు జారీచేశారు.

### గాజాలోని అతిపెద్ద ఆస్పత్రిపై

# ఇజ్రాయిల్ వైమానిక దాడి

(మొదటిపేజీ తరువాయి)

సముద్రం మీదుగా దాడులు చేపట్టేందుకు వీలుగా గతవారం గాజా సరిహద్దులోకి యుద్ధ ట్యాంకులను, సైన్యాన్ని మోహరించింది. గాజాలో వైమానిక దాడులను పెంచుతున్నామని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగరీ కూడా ప్రకటించారు. అలాగే క్షేత్రస్థాయిలో పదాదీ బలగాలను పెంచి భూతల దాడులను విస్తరింపజేస్తున్నామని వెల్లడించారు. ఇజ్రాయిల్ భూతల దాడులను పెంచితే వేలాదికి పైగా పౌరులు మరణించే అవకాశం ఉందని ఐరాస మానవ హక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ హెచ్చరించారు. శుక్రవారం నుండి గాజాలో ఇంటర్నెట్‌తో పాటు టెలీ కమ్యూనికేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన ఖండించారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటి వరకు 7,703 మంది మరణించినట్లు గాజా వైద్య శాఖ మంత్రి తెలిపారు. వీరిలో 3,500 మందికి పపైగా చిన్నారులు ఉన్నట్లు ప్రకటించారు.

# పోరాటాలతోనే తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

దాడి చేసినట్లు రాష్ట్రాన్ని మింగేస్తారని కేసీఆర్ అన్నారు. దళారుల, పైరవీకారుల రాజ్యం తీసుకొస్తారని హెచ్చరించారు. తలసరి ఆదాయంలో అన్ని రాష్ట్రాలనూ అధిగమించి దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని, ఈ తొమ్మిది పదేళ్లలోనే దేశానికి తెలంగాణ తలమానికంగా మారిందని చెప్పటానికి గర్వంగా ఉందన్నారు. గతంలో కరెంటు సరఫరా సరిగా లేక మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పటాకుల్లా పేలిపోతుండేవని, ప్రస్తుతం 24 గంటల కరెంటు ఇస్తున్నామని కేసీఆర్ తెలిపారు. 'కర్ణాటక నుంచి ఉప ముఖ్యమంత్రి డీ కే శివకుమార్ అనే ఓ పెద్ద నాయకుడు వచ్చారు. ప్రచారానికి ఎవరు రావాలి? మనకంటే గొప్పగా ఉన్నవారు రావాలి. కానీ, ఆయనొచ్చి కేసీఆర్ నువ్వు కావాలంటే కర్ణాటకకు వచ్చి చూడు మా గొప్పతనం. రైతులకు ఐదు గంటల పాటు కరెంటు ఇస్తున్నాం అని చెప్పాడు. ఇందుకు నవ్వాలా? ఏడవాలా? 24 గంటలు సరఫరా చేస్తున్న రాష్ట్రానికి వచ్చి ఐదు గంటలు ఇస్తున్నామని చెప్పటం అంటే ఆయన ఇజ్జత్ తీసుకోవడానికే ప్రచారానికి వచ్చారా? తమ రాష్ట్రంలో రైతులకు ఐదు గంటల కరెంటు ఇస్తున్నామని చెప్పిన ఆ సన్నాసికి తెలంగాణలో 24 గంటలు ఇస్తున్న సంగతి తెలియదా? అలా చెప్పటానికి సిగ్గుండాలి. ఒళ్లు తెలిసి మాట్లాడుతున్నారో లేదో అర్థం కావటం లేదు' అని కేసీఆర్ ధ్వజమెత్తారు. కేంద్రం ఎన్ని ఆటంకాలు పెట్టినా మోటార్లకు మీటర్లు పెట్టలేదని, ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రంలోనూ 24 గంటల కరెంటు ఇవ్వడంలేదని వెల్లడించారు. లుంగీ కట్టుకునే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నాడని.. అన్నానికే గతి లేని యూపీతోపాటు పలు రాష్ట్రాల నుంచి కూలీలు వలస వచ్చి తెలంగాణలో పనులు చేసుకుంటున్నారని తెలిపారు. నెహ్రూ ఆనాడు అంబేద్కర్ మాటను గౌరవించి.. దళిత కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే దళిత బిడ్డలు అభివృద్ధి చెంది ఉండేవారని, ఇప్పుడున్న దరిద్రం ఉండేది కాదని కేసీఆర్ చెప్పారు. దళితులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతోనే తమ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో నాలుగు వేల గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామంటున్నారని, ధరణిని తొలగిస్తే మళ్లీ వీఆర్వోల కాలం వచ్చి రూ.10 వేల రైతుబంధుకు మూడు వేల లంచం అడుగుతారన్నారు. ప్రజలు పన్నులు కడితే కేసీఆర్ రైతుబంధు పేరిట వృథా చేస్తున్నాడంటూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించాడని, వ్యవసాయానికి 24 గంటల కరెంటు దుబారా అవుతుంది, మూడు గంటలు చాలని రేవంత్‌రెడ్డి చెప్పాడని అన్నారు. ధరణి గురించి రాహుల్‌గాంధీ ఏదేదో మాట్లాడుతున్నారని, ఆయనకు ఎవుసం ఎరుకనా? ఎద్దు ఎరుకనా? ఇక్కడున్న సన్నాసులు రాసిస్తే చిలుక పలుకులు పలుకుతున్నారని సీఎం కేసీఆర్ విమర్శించారు.

**విచక్షణతో ఓటు వేస్తే ప్రజలు గెలుస్తారు**

పార్టీల గత చరిత్ర, విధానాలు పరిశీలించి విచక్షణతో ఓటు వేస్తే ప్రజలు గెలుస్తారని, లేదంటే ప్రజలు ఓడిపోతారని కేసీఆర్ అన్నారు. ఎన్నికలప్పుడు నానా పార్టీలు, నానా రకాల మనుషులు వస్తుంటారని, వారిని పరిశీలించి అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్న కొద్దీ పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి సంక్షమే పథకాలకు ఇచ్చే మొత్తాన్ని పెంచామని, రైతుబంధు పథకాన్ని దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌తో పాటు ఐక్యరాజ్య సమితి కూడా అభినందించిందన్నారు. దామరచర్లలో రూ.30 వేల కోట్లతో అల్ట్రా మెగా ప్రాజెక్టును ఏర్పాటు చేశామని, నాలుగైదు నెలల్లో నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుందని కేసీఆర్ చెప్పారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాలను కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానం చేసి కోదాడకు నీటిని ఇస్తామని, ఈ ప్రాంతంలో ఎన్నటికీ కరువు రాదని తెలిపారు. కోదాడలో 70 శాతం బీసీలు ఉన్నామంటున్నారు.. వారంతా చైతన్యవంతమై బీసీ నేతను గెలిపించాలని, 10 కోట్లతో బీసీ భవన్‌ను కటిస్తానన్నారు. సునీతకు ఆలయ శిఖరమంత ఓట్లు డబ్బాలో పడాలన్నారు. కాంగ్రెస్ నేత కల్లూరి రామంచ్రారెడ్డితో పాటు పలువురు బీఆర్ఎసలో చేరారు.

# బిఆర్ఎస్ సైనికులు ప్రతి గడపకు వెళ్లి ఓట్లు అడగాలి

## కార్యకర్తల సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: కమ్మర్ పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం చౌట్ పల్లి గ్రామంలోని గురడి రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్, కోటపాటి నర్సింహ నాయుడు,రాజారాం యాదవ్, స్థానిక మండల నాయకులు ,ప్రజాప్రతినిధుల, బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పలు సూచనలు చేశారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధినీ పలువురు వక్తలు ఈ సందర్భంగా కార్యకర్తలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ప్రశాంత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతీ బిఆర్ఎస్ సైనికుడు కంకణబద్దులై పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కేసిఆర్ సహకారంతో మండలంలో వందల కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. అభివృద్దే కాదు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల లబ్ది జరిగిందన్నారు. ఆసరా పెన్షన్లు, రైతు బంధు, రైతు భీమా, సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, కేసిఆర్ కిట్ లాంటి పథకాలతో నేరుగా 90 శాతం పైగా ప్రజలకు లబ్ది చేకూరిందని అన్నారు. బిఆర్ఎస్ సైనికులు ప్రతి గడపకు వెళ్లి ఓట్లు అడగాలనీ, కష్టపడితే లబ్దిదారుల అన్ని ఓట్లు కారు గుర్తుకే పడతాయని మంత్రి వేముల కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.కమ్మర్ పల్లి మండలంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్దిదారులు 21వేల మంది ఉన్నారన్నారు. ఈ మండలంలో యావరేజ్ గా పోలయ్యే ఓట్లు 23 వేలు ఉంటాయని, బిఅర్ఎస్ కార్యకర్తలు నాయకులు ప్రతి లబ్ధిదారుల దగ్గరికి వెళ్లి బిఅర్ఎస్ కు మద్దతు ఇవ్వాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేయాలనీ చెప్పారు. బిఅర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని,బిఅర్ఎస్ పై ప్రజల కు ప్రేమ అభిమానాన్ని ఓట్ల రూపంలోకి మలచాలని కోరారు. మండలంలో 8464 మందికి ఆసరా పెన్షన్లు, రైతు బంధు 8971 మందికి, రైతు భీమా 117 మందికి,1407 మందికి సీఎంఅర్ఎఫ్,757 మందికి గృహలక్ష్మి, కళ్యాణ లక్ష్మి, శాది ముబారక్ 1314 మందికి, 205 కుల సంఘాలకు 9.44 కోట్ల నిధులు, 05 ఆలయాలకు ,14మజీద్ 03చర్చి లకు 2.5 కోట్ల నిధులు ఇచ్చామనీ అన్నారు. వారందరితో ఓట్లు వేయించాలని ఒక్కో కార్యకర్త 10 ఓట్లు వేయించాలని సూచించారు. ప్రపంచంలో రైతు బీమా వంటి బీమా ఎక్కడ లేదు,భూమి లేని పేద వారికి కూడా కేసీఆర్ బీమా తో ధీమా ఇస్తున్నారని, 3వేల రు. సౌభాగ్య లక్ష్మి పేద ఆడపడుచులకు వరమన్నారు. 400రూ .సబ్సిడీ గ్యాస్ సిలెండర్ ఇస్తారని,2 వేలు ఉన్న పెన్షన్ ఐదేళ్లలో 5 వేలకు పెంపు చేస్తామని అన్నారు.ప్రతి పేద కుటుంబానికి సన్న రేషన్ బియ్యం. ఆరోగ్యశ్రీ పరిమితి 15 లక్షలకు పెంపు,రైతు బంధు ఐదేళ్లలో 16 వేలకు పెంపు ఇవన్నీ ప్రద ప్రజల సంక్షేమం కోసం పెట్టినవే అని అన్నారు.ఈ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుక వెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తల పై ఉందన్నారు.

# బీఆర్ఎస్‌ది బూటకపు ప్రచారం

### పేదల బతుకుల బాగు కోసమే : ఖర్గే

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



కర్నాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలవుతున్నాయని, బీఆర్ఎస్ వాళ్లకు అనుమానం ఉంటే వాళ్లు కర్నాటకకు వస్తే హామీల అమలును చూపిస్తామని, అవసరమైతే మీతో పాటు రేవంత్‌రెడ్డి కూడా వస్తారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, బీటీమ్ అనేది ఏం లేదని, ఆ రెండు పార్టీలు కలిసే పని చేస్తున్నాయన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీని మోడీ తుంగలో తొక్కినట్టుగానే కేసీఆర్ కూడా గతంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజలకు హామీలిచ్చి మాట తప్పడం మాత్రమే కాదు, అవసరం తీరాక మర్చిపోవడమూ కేసీఆర్ నైజమన్నారు. తెలంగాణ ఇవ్వగానే సోనియా గాంధీ ఇంటికెళ్లి ఆమె కాళ్లు మొక్కారని, ఆ మరుసటి రోజే మాట మార్చిన ఘనత కేసీఆర్‌దని విమర్శించారు. ఇందిరా గాంధీ మెదక్ ఎంపీగా ఉన్నప్పుడు సంగారెడ్డి, మెదక్‌లో ప్రచారానికి వచ్చి హామీ ఇచ్చినట్టుగానే బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్ ప్యాక్టరీలను నెలకొల్పామని గుర్తుచేశారు. అలాగే, ఇప్పుడు సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు సైతం పక్కాగా తెలంగాణాలో అమలవుతాయని స్పష్టంచేశారు. ఓట్ల కోసం ఇస్తున్న హామీలు కావు. పేదల బతుకుల్లో బాగు కోసం ఇస్తున్న గ్యారంటీలని తెలిపారు. సంగారెడ్డి, మెదక్ నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన విజయభేరి ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా సోనియాగాంధీకి కేసీఆర్ మాట ఇచ్చి తప్పిన విషయం తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు. మెదక్ అంటే స్వర్గీయ ఇందిరాగాంధీకి ఎంతో ఇష్టమని, ఇక్కడి నుంచి పోటీ చేసి దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేదల కోసం పనిచేస్తోందన్నారు. బ్యాంకులు జాతీయం చేసి ఫ్యాక్టరీలను నెలకొల్పిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. రైతు కూలీల కోసం ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చామన్నారు. పది పాయింట్ల ప్రోగ్రాం వంటి నిర్ణయాలు చేశామన్నారు. తెలంగాణ ఎవరిచ్చారు.. ఎవరి కోసం ఇచ్చామని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్ ఉందని, కేసీఆర్ అధికారంలోకి రాగానే ఉన్న సొమ్మును తనకు నచ్చినట్టు ఖర్చు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. తెలంగాణలో ఒక్కో వ్యక్తిపై రూ.5 లక్షల అప్పు చేసి పెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరముందన్నారు. పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డిలో జగ్గారెడ్డిని 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోనియా గాంధీ ఆరు గ్యారంటీలు ఇచ్చారని అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. కర్నాటకలో హామీల అమలును చూసేందుకు వస్తానంటే బస్సులు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క, తదితరులు పాల్గొన్నారు.

# 31న 'మేరా యువ భారత్' ప్రారంభం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: దేశాభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసేందుకోసం ఈ నెల 31న 'మేరా యువ భారత్' వేదిక పేరిట స్వతంత్ర సంస్థను ప్రారంభించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఆదివారం మన్ కీ బాత్ 106వ ఎపిషోడ్‌లో ఆయన మాట్లాడారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించేందుకు 'మేరా యువ భారత్' అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఈ నెల పండగ సీజన్‌లో దేశవ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో ఖాదీ దుస్తులు, స్థానికంగా తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేశారని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 'లోకల్ ఫర్ వోకల్' నినాదానికి ఇది ఎంతో బలాన్నిస్తుందన్నారు. దేశంలోని యువతీయువకులు పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. 'అక్టోబరు 31న దేశంలో అతిపెద్ద సంస్థను ప్రారంభించబోతున్నాం. దాని పేరు మై యంగ్ ఇండియా, మేరా యువ భారత్. దేశాభివద్ధి కోసం నిర్వహించే కార్యక్రమాల్లో యువత కీలక పాత్ర పోషించేందుకు ఈ వేదిక అవకాశాలను కల్పిస్తుంది. యువశక్తిని ఏకీకతం చేయడానికి ఇదో వినూత్న ప్రయత్నం' అని ప్రధాని తెలిపారు.

## చంద్రబాబుకు ఐటీ ఉద్యోగుల మద్దతు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఐటీ కంపెనీలు వచ్చాయని ఐటీ ఉద్యోగులు అన్నారు. హైటెక్ సిటీ సైబర్‌టవర్స్ సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో భాగంగా చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పేందుకు ఆదివారం గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఐటీ ఉద్యోగులు సీబీఎన్ గ్రాటిట్యూడ్ కాన్సెర్ట్ ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ఐటీ ఉద్యోగులు, మద్దతుదారులు, పార్టీ అభిమానులు కుటుంబాలతోసహా భారీగా తరలివచ్చారు. నందమూరి కుటుంబ సభ్యులు నందమూరి రామకృష్ణ, బాలకృష్ణ భార్య వసుంధరాదేవి, గారపాటి లోకేశ్వరి, ఎంపీ రఘురామకృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి అధ్యక్షులు కొలికపూడి శ్రీనివాస్, మాజీ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, సినీ నిర్మాత బండ్ల గణేష్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, దర్శకులు బోయపాటి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

## కబ్జాల చరిత్ర ఎమ్మెల్యే కుటుంబీకులదే

తాండూరు - ప్రభాత సూర్యుడు

తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కుటుంబీకులదే కబ్జాల చరిత్ర అని డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సిరిగిరిపేట్ గ్రామం సర్వేనెం.110లో ఎమ్మెల్యే కోబ్రదర్ ఇందర్‌చెడ్ రాజు ఓపెన్ యాక్షన్‌లో ఎవరినీ రానివ్వకుండా ఒక్కడే తక్కువకే 26ఎకరాల భూమి కొన్నాడని తెలిపారు. సర్వేనెం.138లోని తాండూరులో అక్కడి వ్యాపారులతో డబ్బులు తీసుకొని అక్రమంగా క్రమబద్ధీకరించారని అన్నారు. తాను కష్టపడి డబ్బు సంపాదించానని, ఎమ్మెల్యే మాదిరి తమ సంపాదనకాదని చెప్పారు. 25ఏళ్లుగా తాండూరు ఓటరు లిస్టులో పేరు, ఇళ్లు, వ్యాపారం ఉందని, నేను లోకల్.. అని తెలిపారు. జిల్లా కాంగ్రెసనేత ఉత్తంచంద్ మాట్లాడుతూ.. జిన్‌గుర్తి గ్రామం సర్వే.నెం.206లో రైతుల నుంచి భూమి కొనుగోలు చేసి ఎకరాకు 50వేలు దండుకున్నారని ఆరోపించారు. తాను నిరూపించుకుంటే రాజకీయం వదిలేస్తానని చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పీపుల్స్ డిగ్రీ కళాశాల స్థలం అక్రమించి రోడ్డువేశారని అన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, రవూఫ్, డాక్టర్ సంపత్ ఉన్నారు.

## వీలైనంత త్వరగా భారత సైన్యాన్ని వెనక్కు పంపుతాం..!

**మరోసారి మాల్దీవుల అధ్యక్షుడు సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోపే భారత సైన్యాన్ని తమ గడ్డ నుంచి వెనక్కు భారతదేశానికి పంపుతానని మాల్దీవుల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహ్మద్ ముయిజ్జు ఇదివరకే సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఆయన ఆ అంశాన్ని ప్రస్తావించారు. భారత సైనిక సిబ్బందిని వీలైనంత త్వరగా తమ తీరం నుంచి వెనక్కి పంపేందుకు మాల్దీవులు కృషి చేస్తుందని తెలిపారు. దేశ విదేశాంగ విధానానికి ఇది అవసరమని.. మాల్దీవుల తీరం నుండి భారత సైన్యాన్ని వెనక్కు పంపడమే తన ఎన్నికల ప్రచారంలో ప్రధాన విధామని పేర్కొన్నారు. ఈ విషయంపై తాను భారతదేశంతో స్పష్టమైన, వివరణాత్మక దౌత్యపరమైన సంప్రదింపులు జరుపుతానని వెల్లడించారు.ఇక్కడ తన దృష్టి అసలు సైనిక సిబ్బంది సంఖ్యపై కాదని, మాల్దీవుల్లో భారతీయ సైనికులెవరూ ఉండకుండా చూసుకోవడమేనని మహ్మద్ ముయిజ్జు వివరణ ఇచ్చారు. ఈ విషయంపై భారత ప్రభుత్వంతో చర్చించి.. ఒక మార్గాన్ని కనుగొంటామన్నారు. మాల్దీవుల్లో మోహరించిన భారతీయ సైనిక సిబ్బందిని తొలగించే తన ప్రచార వాగ్దానానికి కట్టుబడి ఉంటానని ఆయన నొక్కి చెప్పారు. తమ గడ్డపై విదేశీ దళాలు అక్కర్లేదని మాల్దీవుల ప్రజలు తెలిపారని.. వారి అభీష్టం మేరకే భారత సైన్యాన్ని వెనక్కు పంపాలని నిర్ణయించానని తెలిపారు. ఇదే సమయంలో.. భారతీయ సైనికులు తిరిగి వెనక్కు వెళ్లాక, వారి స్థానంలో ఇతర దేశాల సైనికులు ఉండరని ఆయన స్పష్టం చేశారు. తాము అన్ని దేశాల నుండి సహాయ, సహకారం కోరుకుంటున్నాము.. పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక సంబంధాలను కోరుతున్నామని చెప్పుకొచ్చారు. కాగా.. మాల్దీవుల ప్రస్తుత అధ్యక్షుడు ఇబ్రహీం సోలిహ్‌పై మహ్మద్ ముయిజ్జు ఘనవిజయం సాధించారు. ఈయన మాల్దీవుల అధ్యక్షుడిగా నవంబర్ 17న బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయనను చైనా మద్దతుదారుగా విస్తృతంగా పరిగణిస్తారు. ఎన్నికల్లో ముయిజ్జు విజయం సాధించిన తర్వాత చైనా ఆయనకు శుభాకాంక్షలు తెలిపింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ మాట్లాడుతూ.. మాల్దీవుల ప్రజల ఎంపికను చైనా గౌరవిస్తుందని, కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుకు అభినందనలని తెలిపింది.

## రామ జన్మభూమి ఉద్యమాన్ని ప్రారంభించినది వారే..



లక్నో: ప్రభాత సూర్యుడు

అయోధ్య లో రామాలయ నిర్మాణం కోసం ఉద్యమాన్ని ప్రారంభించిన ఘనత ఈ దేశంలోని సిక్కు కమ్యూనిటీదేనని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. లక్నోలోని గురుద్వారా ఆలంబాఘ్‌లో గురుగ్రంథ్ సాహిబ్ ప్రకాష్ ఉత్సవ్‌లో ఆదివారంనాడు ఆయన పాల్గొన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు సిక్కు కమ్యూనిటీ ఎంతో చేసిందని కొనియాడారు. కృష్ణా జబిలాల వినియోగంపై వారం రోజుల్లో కౌంటబిర్ దాఖలు చేయాలి..సుప్రీంకోర్టు ఆదేశం. "సిక్కులే రామజన్మ భూమి ఉద్యమాన్ని మొదలుపెట్టారు. వారందించిన సహకారాన్ని ఏ ఒక్క భారతీయుడు మరిచిపోలేడు. సనాతన ధర్మ పరిరక్షణకు సిక్కు కమ్యూనిటీ ఎంతో చేసింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఒక కీలకమైన వాస్తవాన్ని అందరి ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నాను. 1858 డిసెంబర్ 1న నమోదైన ఒక ఎఫ్ఐఆర్ ప్రకారం, గురుగోవింద్ సింగ్ గురుద్వారా ఆవరణలో కొందరు సిక్కులు నినాదాలు చేశారు. గోడల నిండా 'రామ్ రామ్' అని రాశారు" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. భారతదేశాన్ని, భారతీయులను రక్షించాలనే స్ఫూర్తి గురు నానక్ దేవ్ ఇచ్చినదేనని రాజ్‌నాథ్ ప్రశంసించారు. దేశాన్ని, దేశ ప్రజలను కాపాడే గురుతర బాధ్యత మనందరిపైనా ఉందని, గురునానక్ దేవ్ ఈ స్ఫూర్తిని రగిలించారని గుర్తుచేశారు.

# ఎన్నికల విధులు నిష్పాక్షికంగా నిర్వర్తించాలి



**మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హెళికేరి**

రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు : ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని కలెక్టర్ భారతి హెళికేరి అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని స్టాటిక్ సర్వెయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితరాలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండగా.. ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందన్నారు. నిఘా బృందాలు నిబద్ధతతో వ్యవహరించి సీఈసీ నిబంధనలను పాటించాలన్నారు. వివక్ష ప్రదర్శిస్తున్నారనే ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఓటర్లకు నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై దృష్టి కేంద్రీకరించాలని, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. సర్వెయలెన్స్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సమకూర్చిన వాహనాలకు సాంకేతికతతో కూడిన పీటీజీ కెమెరాలను అమర్చుతున్నామని తెలిపారు. వీటి ద్వారా బృందాల పనితీరును కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తామన్నారు. ముఖ్యంగా తనిఖీల సమయంలో ప్రజలను అనవసర ఇబ్బందులు గురిచేయొద్దన్నారు. నగదును జప్తు చేస్తే పంచనమా నిర్వహించి రశీదులు తప్పక ఇవ్వాలని ఆదేశించారు. ఆధారాలను చూపి నగదును రిలీజ్ చేసుకునే వెసులుబాటు ఉందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జెడ్పీ సీఈవో దిలీపకుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ గురించి తెలియజేయాలని సూచించారు. పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ఖర్చును ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన రేట్ కార్డు ప్రకారం లెక్కించాలన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జెడ్పీ సీఈవో దిలీపకుమార్, నోడల్ అధికారులు వెంకట్‌రెడ్డి, ధాత్రిదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఖండించిన క్యూబా




హవానా - ప్రభాత సూర్యుడు : పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ మారణహోమాన్ని క్యూబా ఖండించింది. గత మూడు వారాలుగా గాజాస్ట్రిప్‌పై ఇజ్రాయిల్ చేపడుతున్న బాంబుల దాడిని క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్ శనివారం తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు జాతీయ టెలివిజన్‌లో ఓ ప్రకటనను విడుదల చేశారు. పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ ఆక్రమణ దళాల మారణహోమాన్ని, ఇళ్ల, ఆస్పత్రుల, మౌలిక సదు పాయాల ధ్వంసాన్ని తోసిపుచ్చారు.ఫిడెల్ కాస్ట్రో హయాం నుండి క్యూబా ఇటువంటి ఉగ్రవాద చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 63 ఏళ్ల క్రితం ఇజ్రాయిల్ ఆక్రమణను ఖండిస్తూ .. ఐరాస సాధారణ అసెంబ్లీ ఎదుట కాస్ట్రో చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యుద్ధం ఉద్దేశం ఇతరుల సంపదను దోచుకోవడమని ఆ సమయంలో కాస్ట్రో పేర్కొన్నారని.. ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలకు చెందాల్సిన వస్తువులను, భూమిని దోచుకుంటోందని మండిపడ్డారు. జాతి వివక్ష పేరుతో చిన్న భూభాగానికి పరిమితమైన పాలస్తీనియన్లు నేడు భయానక వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. గాజాలో నేడు కొనసాగుతున్న మానవతా విపత్తును అధ్యక్షుడు డియాజ్ కానెల్ ఖండించారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న దాడిలో మూడువేలమందికి పైగా చిన్నారులు, 1700 మంది మహిళలతో పాటు సుమారు 8,000 మందికి పైగా మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. గాజాస్ట్రిప్‌లో సుమారు 40 శాతం పైగా ఇళ్లు ధ్వంసం కాగా, ఆస్పత్రులు నెమ్మది నెమ్మదిగా పాలస్తీనియన్ల శవాగారాలుగా మారుతున్నాయని అన్నారు. 75 ఏళ్లకు పైగా ఇజ్రాయిల్ దళాల ఆక్రమణ, దుర్వినియోగం, బహిష్కరణ నేడు పాలస్తీనియన్ కుటుంబాలకు మరింత బాధ, ఆగ్రహాన్ని కలిగిస్తుందని అన్నారు. నెతన్యాహూకి వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనాలని గాజాస్ట్రిప్‌లో కాల్పుల విరమణకు పిలుపునివ్వాలని క్యూబా అధ్యక్షుడు అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్ సైన్యం గాజాలో అంతర్జాతీయ మానవతా చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిం చిందని, అక్కడ మారణహోమాన్ని ఆపడం అత్యవసర మని అన్నారు. ఈ సందర్భంగా నాల్గవ జెనీవా కన్వెన్షన్ ప్రకారం యుఎన్ తీర్మానాలను ఇజ్రాయిల్ అతిక్రమిం చిందని మండిపడ్డారు. ఇజ్రాయిల్ మరాణకాండను నిలువరించని యుఎన్ భద్రతా మండలిని అసమర్థతను ఖండించారు.దేశాల మద్దతుతో ఐరాస జనరల్ అసెంబ్లీ తక్షణమే కాల్పుల విరమణను డిమాండ్ చేయడానికి ముసాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించాలని క్యూబా పిలుపునిచ్చింది. పాలస్తీనా పౌరుల రక్షణ కోసం ఓ యంత్రాంగాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని, పౌరుల తరలింపును నిలువరించాలని, అత్యవసర మానవతా సాయాన్ని పంపాలని సూచించింది.

# ప్రార్ధనా సమావేశంలో పేలుడు

## - ఇద్దరు మృతి - 40 మందికి గాయాలు- కేరళలోని కాలామస్సేరిలో ఘటన



తిరువనంతపురం -ప్రభాత సూర్యుడు : కేరళలోని కొచ్చి నగరానికి సమీపంలో కాలామస్సేరిలో ఆదివారం జరిగిన పేలుడు ఘటనలో ఇద్దరు చనిపోయారు. మరో 40 మంది గాయపడ్డారు. కాలామస్సేరిలోని అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో 'జహెూవా సాక్ష్యం' పేరిట ప్రత్యేక ప్రార్థనా కూటమి నిర్వహించారు. ఈ ప్రార్థన స్థలంలోనే ఐఇడి పేలుడు చోటుచేసుకుంది. పేలుడు జరిపింది తానేనని త్రిస్సూర్‌కు చెందిన డొమినిక్ మార్టిన్ అనే వ్యక్తి పేర్కొన్నాడు. ఈ మేరకు అతను ఫేస్‌బుక్ వెబ్‌సైట్‌లో ఒక వీడియో పోస్టు చేశాడు. 'ప్రార్థనలు నిర్వహిస్తున్న సంస్థ ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. వారి సైద్ధాంతిక భావాలు దేశానికి వ్యతిరేకమైనవి. జాతీయగీతం పాడరాదని, సైనిక సర్వీసుల్లో చేరవద్దని ప్రజలను ఆ సంస్థ ప్రేరేపిస్తోంది' అని మార్టిన్ ఆరోపించాడు. ఆన్‌లైన్ ద్వారా బాంబు తయారం చేయడం నేర్చుకొని, టిఫిన్ బాక్స్‌లో బాంబులు ఉంచి రిమోట్ కంట్రోల్ ద్వారా పేల్చినట్లు సదరు నిందితుడు పేర్కొన్నాడు. త్రిస్సూర్‌లోని కొడకర పోలీసు స్టేషన్‌లో మార్టిన్ లంగిపోయాడు. తాను కూడా క్రైస్తవుడినేని పేర్కొన్నాడు. అయితే అన్ని కోణాలను కేసును దర్యాప్తు చేస్తున్నామని శాంతిభద్రతల విభాగపు ఎడిజిపి ఎంఆర్ అజిత్ కుమార్ తెలిపారు. కాగా సిసిటివి దృశ్యాలు, మార్టిన్ మొబైల్ ఫోన్లలోని దృశ్యాలను పరిశీలించిన మీదట ఈ ఘాతుకానికి మార్టినే ఒడిగట్టి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడి మొబైల్ ఫోన్లలోని గూగుల్ సెర్చ్ హిస్టరీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. బాంబు తయారీ కోసం వాడిన సామగ్రిని మార్టిన్ నివాసంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**దర్యాప్తు తర్వాతే వివరాలు వెల్లడిస్తాం : సిఎం**

బాంబు పేలుడు ఘటనను ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సమావేశంలో పాల్గనేందుకు న్యూఢిల్లీలో ఉన్న విజయన్ పేలుడు ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, అది పూర్తి అయిన తర్వాతే తదుపరి వివరాలు వెల్లడిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఇది చాలా తీవ్రమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఘటనలో చని పోయిన, గాయపడినవారి సంఖ్యను ఆయన నిర్ధారిం చారు. రాష్ట్రంలో శాంతియుత వాతావారణం పరిరక్షిం చేందుకు, సామరస్యతను పెంపొందించేందుకు వీలుగా ఈ నెల 30న అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం బాంబు పేలుడును తీవ్రంగా ఖండించింది. కేరళ ప్రజానీకం శాంతియుత జీవనాన్ని గడుపుతారని, శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేసింది. రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేందుకే ఈ దాడి జరిగినట్లుగా భావిస్తున్నామని పేర్కొంది. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. కాగా ఈ దాడిలో గాయపడినవారికి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందిస్తోంది. సెలవులో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు, ఉద్యోగులందరూ తక్షణమే విధుల్లో చేరాలని ఆరోగ్య, వైద్య విభాగాధిపతులకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి ఆదేశాలు జారీ చేశారు.

## యాచారం మాజీ సర్పంచ్ యాదయ్య మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**- టిపిసిసి సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి**



**యాచారం – ప్రభాత సూర్యుడు :** యాచారం మాజీ సర్పంచ్ తేరేటి యాదయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తన స్వగృహంలో శనివారం సాయంత్రం మరణించారు. యాచారం గ్రామ సర్పంచిగా 10 సంవత్సరాలు సేవలందించారు .మండలంలో కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు ఉన్న నాయకుడిగా నిలిచారు. మరి నిరంజన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి యాదయ్య పార్థివ దేహం పై పూలమాలవేసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు దెంది రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కోమ్మిడీ శ్రీనివాస్ రెడ్డి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరిన దండుమైలారం గ్రామస్తులు

**- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**ఇబ్రహీం పట్నం– ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం మాండలం దండుమైలారం గ్రామం నుండి వివిధ పార్టీలకు చెందిన 30మంది నాయకులు, కార్యకర్తలు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్ర మాలకు ఆకర్షితులై పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వద్దకు వచ్చి స్వచ్ఛందంగా వారి సమక్షంలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## ఉల్లి ధరల పెరుగుదలపైకేంద్రంపై ధ్వజమెత్తిన ఖర్గే



**న్యూఢిల్లీ – ప్రభాత సూర్యుడు :** ఉల్లి ధరల పెరుగు దలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రంపై విరుచుకుపడ్డారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించిన అనంతరం ఐదు రాష్ట్రాల ప్రజలు ఉల్లి ధరలు మరో సారి ఎందుకు పెరిగాయనే రహస్యాన్ని వెల్లడిస్తారని అన్నారు. సరఫరా తగ్గడంతో ఢిల్లీలోని రిటైల్ మార్కెట్‌లో ఉల్లి ధరలు రూ.65 - 80కి పెరిగాయి. మరోసారి ఉల్లి ధరలు ఎం దుకు భారంగా మారాయి. ఈ ప్రశ్నకు సమాధానంగా ప్రజలు వచ్చే ఎన్నికల్లో బిజెపికి మంచి గుణపాఠం చెబుతారని అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్ల బిజెపి ప్రభుత్వ హయాంలో ద్రవ్యోల్బణ భారంతో ప్రజల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతిసారీ ద్రవ్యోల్బణం అంశంపై మోడీ ప్రభుత్వం జోకులు వే స్తోందని మండిపడ్డారు. '' ద్రవ్యోల్బణం కనిపించడం లేదు. నే ను ఉల్లిపాయలు తినను. ఇతర దేశాల కంటే భారత్‌లో మెరుగ్గా ఉంది '' అని ప్రజలను హేళనచేస్తోందని దుయ్యబట్టారు.

## ఎన్నికల్లో గెలిపిస్తే ప్రతి పేద కుటుంబానికి 60 గజాల ప్లాట్

**-ముచ్చర్లలో మహిళలతో కొత్త మనోహర్‌రెడ్డి**

**కందుకూరు– ప్రభాత సూర్యుడు :** ఈ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే తనను గెలిపిస్తే తన సొంత భూమిలో ప్రతీ పేద కుటుంబానికి 60గజాల చొప్పున ప్లాటు ఇస్తానని కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి ప్రజలకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఆదివారం ముచ్చర్లలో తనకు మద్దతిస్తున్న వారితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల నుంచి నియోజకవర్గంలో వెయ్యి కుటుంబాలకు తన సొంత స్థలంలో 60గజాల చొప్పున ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిచ్చానని ఈ సందర్భంగా తెలిపారు. నిరుపేద ఇంట్లో ఆడపిల్ల పెళ్లికి పుస్తె మట్టెలు, పట్టు వస్త్రాలను అందజేశానన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానన్నారు. పేదల కోసం పనిచేసే పనిచేసే తనకు ప్రజలు ఓటు వేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బిక్షపతి, నాయకులు రాజేందర్, లక్ష్మయ్య, రాఘవేందర్, నాగార్జున, దశరథ్, కుమార్, రవి, మహేందర్, శ్రీకాంత్, కృష్ణ, సత్తయ్య, రాజయ్య, సంతోష్, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శిగా గుండెమోని మల్లేష్

**ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ రెడ్డి**



**మంచాల – ప్రభాత సూర్యుడు :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా మంచాల మండలంలోని ఎల్లమ్మ తండా గ్రామానికి చెందిన గుండెమోని మల్లేష్ ముదిరాజ్ నియమితులయ్యారు. హైదరాబాదులో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సహకరించిన జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి, శాసనసభ ప్రతిపక్ష నాయకుడు బట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులకు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బూత్ కమిటీలో కాంగ్రెస్ పార్టీని పూర్వ వైభవం తెస్తానని రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తెచ్చే దిశగా కృషి చేస్తానని ఈ నియామకం సందర్భంగా మల్లేష్ ని మాజీ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల మాజీ ఎంపీపీ గుండె మోని జయమ్మ ఎంపీటీసీలు ఎడ్మ నరేందర్ రెడ్డి ,జయానంద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేరళ పేలుళ్లు .. లొంగిపోయిన 48 ఏళ్ల అనుమానితుడు

**తిరువనంతపురం – ప్రభాత సూర్యుడు :** కేరళలోని కలమస్సేరిలో పేలుళ్లకు సంబంధించి 48 ఏళ్ల అనుమానిత వ్యక్తి లంగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం కలమస్సేరిలోని కన్వెన్షన్ సెంటర్‌లోని ప్రార్థనల సమయంలో జరిగిన పేలుళ్లలో ఒకరు మరణించిన సంగతి తెలిసిందే. వివరాల ప్రకారం.. జెహోవా సాక్షుల సమావేశం కోసం కన్వెన్షన్ సెంటర్‌కు ఆదివారం ఉదయం సుమారు 2,000మందికి పైగా హాజరయ్యారు. వీరంతా ప్రార్థనల కోసం కళ్లు మూసుకుని ఉండగా ఉదయం 9.45 గంటల సమయంలో మొదటి పేలుడు జరిగింది. అనంతరం 5-10 నిమిషాల వ్యవధిలోనే వరుస పేలుళ్లు జరిగాయి. ఈ పేలుళ్లకు సంబంధించి 48 ఏళ్ల అనుమానిత వ్యక్తి కోడకర్ర పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు కేరళ ఎడిజిపి (లా అండ్ ఆర్డర్) అజిత్ కుమార్ తెలిపారు.ఈ పేలుళ్లలో ఒకరు మరణించగా, 56 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కన్వెన్షన్ సెంటర్ లోపలి వైపు తాళాలు వేసి ఉండటంతో వారిని క్షతగాత్రుల తరలింపు ఆలస్యమైంది. టిఫిన్ బాక్సులో ఉన్న పేలుడు పదార్థాల కారణంగా పేలుళ్లు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. హాల్ మధ్యలో మొదటి పేలుడు జరిగిందని కలమస్సేరి ఎంపి హిబి ఈడెన్ పేర్కొన్నారు. అదృష్టవశాత్తు వారిని తరలించేందుకు ఓ ప్రణాళిక సిద్ధం చేశామని, అయితే పెద్ద ఎత్తున పొగ వ్యాపించడంతో తొక్కిసలాట చోటుచేసుకుందని అన్నారు. గాయపడిన వారిని జిల్లా లోని వివిధ ఆస్పత్రులకు తరలించామని, వీరిలో 18 మంది ఐసియులో ఉన్నట్లు తెలిపారు. ఈ పేలు ళ్లను దురదృష్టకరమైన ఘటనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. పరిస్థితిని తీవ్రం గా పరిగణిస్తున్నామని, పోలీసు శాఖ అప్రమత్తమైందని, పేలుడు ప్రదేశానికి చేరుకున్నట్లు తెలిపారు. ఈ పేలుళ్ల ఘటనను జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఐఎ) విచారించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సాక్ష్యాధారాలను సేకరించేందుకు ఫోరెన్సిక్ టీమ్ ఆ ప్రదేశానికి చేరుకున్నట్లు పేర్కొన్నాయి. పేలుళ్ల ఘటనతో ఆరోగ్య సిబ్బంది అందరూ విధులకు హాజరుకావాలని రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ ఆదేశించారు.

## పాలస్తీనా వ్యవహారంలో భారత్ తడబడటు

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు :**

నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ప్రెసిడెంట్ శరద్ పవార్ ఇజ్రాయేల్ హమాస్ యుద్ధంపై స్పందించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇంకా కన్ఫ్యూజన్ స్టేట్‌లోనే ఉందని విమర్శించారు. పాలస్తీనా వ్యవహారంలో ఏ వైపు నిలబడాలో తేల్చుకోలేకపోతోందని అన్నారు. చరిత్రను గమనిస్తే భారత్ ఎప్పుడూ పాలస్తీనాకే మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఇజ్రాయేల్‌కి ఎప్పుడూ అండగా ఉండలేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఒక్కొక్కరూ ఒక్కో విధంగా మాట్లాడు తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయేల్‌కి మద్దతునిచ్చారని, కానీ విదేశాంగ శాఖ మంత్రి అందుకు భిన్నమైన ప్రకటన చేసిందని అన్నారు. అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయేల్‌పై హమాస్ దాడులు మొదలయ్యాయి. అక్టోబర్ 8న ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై స్పందించారు. ఇది చాలా గ్భ్రాంతి కలిగించిందని ప్రకటించారు. ఇజ్రాయేల్‌కి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అక్టోబర్ 10వ తేదీన ఇజ్రాయేల్ ప్రధాని నెతన్యాహుతో ప్రధాని మోదీ మాట్లాడారు. రెండ్రోజుల తరవాత అక్టోబర్ 12న విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందం బగ్చీ స్పందించారు. పాలస్తీనాకు స్వతంత్ర హోదా ఇచ్చే విషయంలో భారత్ ఎప్పుడూ అండగానే ఉంటుందని, అందుకు మద్దతునిస్తుందని ప్రకటించారు. దీనిపైనే శరద్ పవార్ విమర్శలు చేశారు. ఒకే విషయంలో భారత్ ఇలా భిన్నంగా స్పందించడం ఏంటని ప్రశ్నించారు. అక్కడ వేలాది మంది ప్రాణాలు కోల్పోతుంటే భారత్ ఇలా వ్యవరించడం ఏ మాత్రం సరికాదని అబి ప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఇజ్రాయేల్, హమాస్ యుద్ధంపై తీర్మానం ప్రవేశపెట్టి ఓటింగ్ నిర్వహించారు. అయితే..ఈ ఓటింగ్‌కి భారత్ దూరంగా ఉంది. దీనిపైనే శరద్ పవార్‌ని ప్రశ్నించగా...ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడే కాదు. యుద్ధం మొదలైనప్పుడే శరద్ పవార్ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. ఇజ్రాయేల్‌కి మద్దతునివ్వడాన్ని తప్పు బట్టారు. గత ప్రధాన మంత్రులను గుర్తు చేసుకున్న శరద్ పవార్...మొదటి నుంచి భారత ప్రధానులందరూ పాలస్తీనాకే మద్దతునిచ్చారని స్పష్టం చేశారు. శరద్ పవార్ చేసిన ఈ వ్యాఖ్యల్ని పలువురు బీజేపీ మంత్రులు ఖండించారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఇజ్రాయేల్, హమాస్ యుద్ధంపై కీలక చర్చ జరిగింది.

ఇప్పటికిప్పుడు ఉద్రిక్త పరిస్థితుల్ని తగ్గించడంతో పాటు దాడులు ఆపేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. గాజా సరిహద్దు ప్రాంతంలోని ప్రజలకు మానవతా సాయం అందించేందుకు సహకరించాలనీ పిలుపునిచ్చారు. దీనిపై ఓటింగ్ కూడా నిర్వహించారు. అయితే...ఈ ఓటింగ్‌కి భారత్ దూరంగా ఉంది. అక్టోబర్ 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయేల్‌పై దాడులకు దిగారు. అప్పటి నుంచి యుద్ధం కొనసాగుతూనే ఉంది. గాజానే టార్గెట్‌గా చేసుకుని ఇజ్రాయేల్ భీకర దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో వేలాది మంది పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఐరాస లోని 193 సభ్య దేశాలు నిర్వహించాయి.

## సొంత గూటికి 'యాచారం'



**ఆమనగల్లు – ప్రభాత సూర్యుడు :** తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు, సుద్దపల్లి సర్పంచ్ యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ సొంత గూటికి చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి, మాడ్గుల మండల నాయకులతో కలిసి రేవంత్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మాడ్గుల మండలాధ్యక్షుడిగా పనిచేసిన వెంకటేశ్వర్లు గౌడ్ మూడేళ్ల క్రితం ఆ పార్టీని వీడారు. కాంగ్రెస్ అగ్రనేతలు, అనుచరులు, అభిమానుల సూచన మేరకు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని రేవంత్ రెడ్డి సూచించినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కొత్త పాండు గౌడ్, పులికంటి లక్ష్మయ్య, జంగయ్య, యాదయ్యగౌడ్, నారాయణ గౌడ్, పురుషోత్తం రెడ్డి, దేవయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ల్యాప్‌టాప్‌లు..

**- పాత పెన్షన్ పథకానికి మద్దతు**
**- పశువుల పేడ కొనుగోలు**
**- రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలు**

**జైపూర్ – ప్రభాత సూర్యుడు :** రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ ఎన్నికల హామీల జాబితాను విడుదల చేసింది. ఓటర్లలో అధిక సంఖ్యలో ఉన్న, కీలకమైన విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా తన వాగ్దానాలను ప్రకటించింది. కాలేజీ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం చట్టం ద్వారా పాత పెన్షన్ పథకం (ఓపీఎస్)కు మద్దతుగా నిలవటం, పశువుల పేడను కొనటం వంటివి ఇందులో ఉన్నాయి. ఆయన ఇలా ఐదు కొత్త ఎన్నికల హామీలను అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రకటించింది. ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌లోని కాంగ్రెస్ వార్ రూమ్‌లో విలేకరుల సమావేశంలో గెహ్లాట్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పశువుల పేడను కిలో రూ.2 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. "ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని భూపేష్ బఘెల్ ప్రభుత్వం మాత్రమే అటువంటి పథకాన్ని అమలు చేస్తోంది. ఇది రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుంది" అని గెహ్లాట్ చెప్పారు. ప్రతి విద్యార్థికీ ఇంగ్లీషు మీడియం విద్యనందిస్తామన్న హామీని ప్రకటించారు. ఇప్పటి వరకు 3 వేల ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ప్రారంభించామనీ, అందులో 6 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రస్తుతం లాటరీ విధానంలో విద్యార్థులను కేటాయించాల్సి ఉండగా, డిమాండ్ ఉన్న చోట ఇంగ్లీషు మీడియం పాఠశాలను తెరుస్తామని పార్టీ హామీ ఇస్తున్నదని తెలిపారు.పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) చట్టానికి మద్దతుగా కాంగ్రెస్ ఉంటుందని ఆయన చెప్పారు. ఓపీఎస్‌ను బీజేపీ వ్యతిరేకిస్తున్నందున, రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఓపీఎస్‌ను ఉపసంహ రించు కుంటామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు భయ పడుతున్నారని ఆయన అన్నారు. పెరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం చిరంజీవి ఆపద బీమా హామీని తీసుకువస్తుందనీ, ఇందులో ప్రతి బాధిత కుటుంబానికీ రూ. 15 లక్షల వరకు బీమా కల్పిస్తామని ఆయన చెప్పారు. మొత్తం 200 అసెంబ్లీ స్థానాల్లో కాం గ్రెస్ పార్టీ ఐదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నదని తెలి పారు. జుంజునులో జరిగిన ర్యాలీలో పార్టీ నాయ కురాలు ప్రియాంక గాంధీ సమక్షంలో గెహ్లాట్ గృహ లక్ష్మి యోజన కింద కుటుంబ పెద్దలకు ఏటా రూ. 10,000 ప్రకటించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215